# వినియోగదారుల బృందాల పనితీరుపై

## శిక్షణ నమూన

రూపకల్పన: పిఆర్‌పి & వాసన్



వాసన్

IGWDP

# వినియోగదారుల బృందాల పనితీరుపై శిక్షణ నమూన

లక్ష్యం: వినియోగదారుల బృందాల పనితీరు బాధ్యతలు గురించి తెలుసుకుంటారు.

**నేర్చుకునే ఉద్దేశాలు:**

1 వ్యక్తిగతంగా, సమష్టిగా సాధించగలిగే దాని గురించి తెలుసుకుంటారు

2 గుంపు అంటే ఏమిటి? గుంపుకి, గ్రూపుకి తేడాలు, లాభాలు, కట్టుబాట్లు గురించి తెలుసుకుంటారు

3 వినియోగదారుల బృందాల బాధ్యతలు తెలుసుకుంటారు

4 సహజ వనరులకు సంబంధించిన కట్టుబాట్లు తెలుసుకుంటారు

**విషయాలు:**

- పరిచయాలు
- వ్యక్తిగతంగా, సమష్టిగా సాధించేది
- గ్రూపు అనగా ఏమిటి? గుంపుకి గ్రూపుకి తేడా, కట్టుబాట్లు, లాభాలు
- వినియోగదారుల బృందాలు బాధ్యతలు
- వినియోగదారుల బృందం వనరుల ప్రణాళిక, సంరక్షణ, యాజమాన్యాలు
- సహజ వనరులకు సంబంధించిన కట్టుబాట్లు

**సమయం: రెండురోజులు**

# సెషన్ - 1

**విషయం: పరిచయాలు**

**పరిచయాలు - శిక్షణ బాధ్యత, నియమాలు**

**పద్ధతి: బెలూన్ ఆట**

**సమయం: ఒక్క గంట**

**కావలసిన మెటీరియల్: బెలూన్లు, దారం, ప్లాస్టిట్ టబ్, మార్కర్లు**

**ఆట వివరణ:**బెలూన్లను గాలితో నింపి దారంతో కట్టి ప్లాస్టిక్ టబ్ (లేదా వూదిన బెలూన్లను వేసే ఒక పాత్ర)లో బెలూన్లు వేసి హాలు మధ్యలో పెట్టాలి. పాల్గొనే వారి సభ్యుల పేర్లను ముందుగా ఫెసిలిటేటర్ సేకరించి బెలూన్లపై మార్కరు పెన్నుతో పెద్ద అక్షరాలు రాసి వుంచాలి. తరువాత సభ్యులందరికి ఒక్కొక్కరు ఒక్కొక్క బెలూన్ తీసుకొని దానిపై ఎవరి పేరైతే రాసివుందో ఆ వ్యక్తి దగ్గరకు వెళ్ళి పరిచయం చేసుకొని అతనికి సంబంధించి సాధ్యమైనంత తక్కువ సమయంలో ఎక్కువ సమాచారం అనగా ఉదా: అతడు / ఆమె అలవాట్లు, చదివిన పుస్తకాలు, కుటుంబ వివరాలు మొదలగునవి సేకరించమని అందరికి ఫెసిలిటేటర్ చెప్పాలి. 10

నిమిషాల నుండి 15 నిమిషాల సమయం కేటాయించాలి. తరువాత అందరిని వారి వారి స్థలాల్లో కూర్చోమని చెప్పి పరిచయం చేసుకున్న ఇద్దరిద్దరు ఒకరి గురించి ఇంకొకరు ప్లీనరిలో పరిచయం చేయాలి.

పరిచయాలు ముగిసిన తరువాత ఇలా పరిచయం చేసుకోవడం ఎలా అనిపించిందని సభ్యులను అడగాలి. సభ్యులు వారి అభిప్రాయాలు తెలిపిన తరువాత నియమాలు, బాధ్యతలు ఏర్పాటు చేయాలి.

**నియమాలు:**

ఉదా: అందరూ సమయం పాటించాలి, ఆలస్యంగా వస్తే ఒక పాట పాడాలి. ఇంకా ఏమి నియమాలు ఉండాలి అని గ్రూపు సభ్యులను అడుగుతూ ఏర్పాటు చేయాలి.

**బాధ్యతలు: 1. మోడరేటర్ 2. రిపోర్టింగ్ టీమ్**

ప్రతిరోజు గ్రూపుకు ఒక మోడరేటర్ ఉండాలి. ఎవరుంటారు అని అడుగుతూ మూడు రోజులకు ముగ్గురు మోడరేటర్లను నియమించాలి.

**మోడరేటర్ చేయవలసిన పనులు:**

1. సభ్యులందరు సమయం పాటించేలా చూడాలి
2. సెషన్ జరిగే సమయంలో అందరూ పాల్గొంటున్నారా లేదా చూడాలి
3. సభ్యులందరికీ సమయం గుర్తు చేయాలి
4. చిన్న చిన్న గ్రూపులు అంటే ఇద్దరిద్దరు గుసగుసగా మాట్లాడకుండా చూడాలి

ప్రతిరోజు జరిగే చర్చలన్నింటిని రాయడానికి ఎవరుంటారు (ఇద్దరు చొప్పున ఉండాలి) ఫెసిలిటేటర్ గ్రూపు సభ్యులను అడుగుతూ మూడు రోజులకు రిపోర్టింగ్ టీంని నియమించాలి.

**రిపోర్టింగ్ టీం బాధ్యత:**

శిక్షణలో జరిగిన విషయాలన్నింటిని ఏ పద్దతిలో చర్చించామో నేర్చుకున్న అంశాల గురించి నివేదిక రూపంలో రాసి ప్రజెంట్ చేయాలి.

**ఫెసిలిటేటర్‌కు సూచనలు:**

నివేదిక సమర్పణ అనంతరం గ్రూపు సభ్యులను నివేదికపై ఫీడ్‌బాక్ ఇమ్మని చెప్పాలి. ఫెసిలిటేటర్ కూడా నివేదిక సమర్పించిన టీంకు ఫీడ్‌బాక్ ఇవ్వాలి. వీటన్నిటిని ఒకసారి క్రోడీకరణ చేసి సెషన్ ముగించాలి.

# సెషన్ - 2

**విషయం: వ్యక్తిగతంగా, సమష్టిగా సాధించేది**

**ఉద్దేశం: వ్యక్తిగతంగా, సమష్టిగా సాధించేది దాని గురించి తెలుసుకుంటారు**

**సమయం: 1గంట**

**పద్ధతి: చేతి వేళ్ళతో ఆట**

**వివరణ:**

ఫెసిలిటేటర్ గ్రూపు సభ్యులందరితో జరిగే సెషన్ గురించి కొద్దిగా వివరిస్తూ చేతివేళ్ళతో ఆట పరిచయం చేయాలి అది ఎలా ఆడించాలి అంటే ఫెసిలిటేటర్ ముందుగా అందరిని నిశ్శబ్దంగా వుండమని చెప్పాలి. అందరు ఫెసిలిటేటర్ చేసినట్లుగా చేయమని చెప్పాలి. ఫెసిలిటేటర్ అందరికి కన్పించేటట్లు ఎడమచేయి అరిచేతిపై కుడిచేయి చూపుడు వేలుతో సౌండ్ చేయాలి తరువాత మధ్యవేలు తరువాత ఉంగరం వేలు, చిటికిన వేలు ఆఖరిగా ఐదు వేళ్ళతో పెద్దగా చప్పుడు వచ్చేటట్లు చేసి చూపించాలి అలా అందరు చేసిన తరువాత రివ్యూ చేయాలి.

**రివ్యూలో అడగవలసిన ప్రశ్నలు:**

1 ఒకరిగా వున్నప్పుడు ఐదుగురికి కలిసినప్పుడికి తేడా ఏమిటి?

2 ఈ ఆట ద్వారా ఏమి తెలుసుకుంటారు?

వచ్చిన విషయాలను చార్డుపై రాయాలి. అన్ని రాసిన తరువాత ఒకరిగా వుండటానికి ఇష్టపడతారా గ్రూపుగా వుండటానికి ఇష్టపడతారా? ఒకరిగా సాధించలేనిది గ్రూపుగా సాధిస్తారు.

# సెషన్ -3

**విషయం: గుంపు అంటే ఏమిటి?**

**గుంపుకి, గ్రూపుకి తేడా ఏమిటి? కట్టుబాట్లు, లాభాలు**

**పద్ధతి: పోస్టర్లు, బ్రైన్‌స్ట్రామింగ్**

**సమయం: 1 గంట**

**కావలసిన వస్తువులు: బృందానికి సంబంధించిన పోస్టర్లు, గ్రూపు అనగా అనే సిడి, బ్రౌన్‌షీట్లు, మార్కర్లు**

**వివరణ:**

ఫెసిలిటేటర్ గ్రూపు సభ్యులను బృందం అనగా ఏమిటి అని అడగాలి. సభ్యులు చెప్పిన విషయాలు ఉదా: పదిమంది కలిస్తే బృందం అని, సమస్యపై మాట్లాడటం, ఒకే సమస్య వున్న వాళ్ళు కలవడం అని చెప్పినట్లయితే ఆ విషయాలన్నింటిని చార్డుపై రాయాలి.

ఫెసిలిటేటర్ దగ్గరున్న పోస్టర్లు ఉదా: కొంతమంది గుంపుగా చెట్టుకింద గూడి మాట్లాడినట్టు, మార్కెట్లో కొంతమంది ఉన్నట్లు దేవాలయంలో కొంతమంది వున్న పోస్టర్లు చూపిస్తు దేనిని గ్రూపు అంటారు అని ప్రశ్నించాలి. అందరు చెప్పిన విషయాలని క్రోడీకరిస్తూ గ్రూపు అనగా సభ్యులు చెప్పిన విషయాలను కలుపుతూ ఒక నిర్వచనం రాయాలి.

**నిర్వచనం:**

గ్రూపు అనగా కొంతమంది వ్యక్తులు ఒకే ఆశయంతో కొన్ని ఉద్దేశాలు ఒకే ఆశయంతో కొన్ని ఉద్దేశాలు, కట్టుబాట్లు కలిగి వున్న దానిని గ్రూపు అంటారు.

**గ్రూపునకు ఖచ్చితంగా వుండాల్సినవి**

1 ఆశయం వుండాలి

2 పేరు

3 నాయకత్వం వుండాలి మారుతుండాలి

4 కట్టుబాట్లు

5 పుస్తకాలు

పైన పేర్కొన్న ఐదు అంశాలు గ్రూపునకు ఖచ్చితంగా వుండాలి. ఈ ఐదు కలిగి వున్న దానినే గ్రూపు అంటారు.

**గ్రూపుకి వుండాల్సిన కట్టుబాట్లు**

1 అనుకున్న సమాయానికి సమావేశాలు జరగాలి

2 అందరు సమయానికి రావాలి

3 ఆలస్యంగా వస్తే జరిమానా

4 ఒకరిని ఒకరు గౌరవించుకోవాలి

5 సమావేశానికి రానియెడల ముందుగా తెలియచేయాలి

6 వరుసగా మూడు సమావేశాలకు రాకపోతే గ్రూపు సభ్యత్వం నుండి తొలగిస్తాం

పైన పేర్కొన్న కట్టుబాట్లు ప్రతి గ్రూపుకి వుండటం వల్ల గ్రూపులు సక్రమంగా నిర్వహించటానికి అవకాశం వుంటుంది.

**లాభాలు:**

- సమావేశాలు సక్రమంగా జరుగుతాయి
- పొదుపులు పద్ధతిగా వసూలవుతాయి
- సమస్యలు పరిష్కారం కలుగుతుంది
- సభ్యుల అవసరాలు తీరతాయి
- ఒకరికొకరు సహాయ సహకారాలుంటాయి
- విషయ పరిజ్ఞానం పెంపొందించుకుంటారు
- ప్రశ్నించే అధికారం కలుగుతుంది
- తక్కువ వడ్డీకి అప్పు సౌకర్యం దొరుకుతుంది
- సామాజిక పరిస్థితి మెరుగుపడుతుంది
- ఆర్థిక పరిస్థితి పెరుగుతుంది

- నాయకత్వ లక్షణాలు మెరుగుపడతాయి, నాయకులుగా ఎదుగుతారు
- మోసాలను ఎదుర్కొంటారు
- రాజకీయంగా బలపడతారు

గ్రూపులుగా వుండటం వల్ల పైన పేర్కొన్న లాభాలే కాకుండా ఇంకా అనేక రకాలైన లాభాలు పొంది మంచి జీవనం జీవించటానికి అవకాశం వుంటుంది.

**ముఖ్యప్రశ్నలు:**

1 గ్రూపు అనగా నేమి?

2 ఎలాంటి కట్టుబాట్లు వుండాలి

3 గుంపుకి, గ్రూపుకి తేడా ఏమిటి?

**జవాబు:**

**గ్రూపు అనగా . . .**

- ఆశయం వుండాలి
- పేరు వుండాలి
- నాయకత్వం వుండాలి
- కట్టుబాట్లు వుండాలి
- పుస్తకాలుండాలి

ఈ జవాబుని అందరు చెప్పాలి. అలాగే కట్టుబాట్లు పైన చెప్పిన కట్టుబాట్లు చెప్పగలగాలి.

**జవాబు:**

**గుంపుకి, గ్రూపుకి తేడా ఏమిటి?**

- ఆశయం లేకుండా వుండేది
- పేరు వుండదు
- నాయకత్వం వుండదు
- కట్టుబాట్లు వుండవు
- పుస్తకాలుండవు

ఫెసిలిటేటర్ అవి చెప్పగలుగుతున్నారా లేదా గమనించి అందరికి అర్థమైందా లేదా అని గమనించి సెషన్ ముగించాలి.

# సెషన్ - 4

**విషయం: వినియోగదారుల బృందాలు, వనరుల ప్రణాళికలు, సంరక్షణ యాజమాన్యం**

**ఉద్దేశం: వనరుల ప్రణాళిక సంరక్షణ, యాజమాన్యం గురించి తెలుసుకుంటారు**

**పద్ధతి: మంచి, చెడు కేస్‌స్టడీ కాపీలు, బ్రౌన్‌షీట్స్, మార్కర్లు**

**సమయం: రెండు గంటలు**

**కావలసిన మెటీరియల్: చిన్నవి 300 రాళ్ళు, కేస్‌స్టడీ కాపీలు, బ్రౌన్‌షీట్స్, మార్కర్లు**

**వివరణ:**

సభ్యులను చిన్న గ్రూపులు రెండుగా విభజించి మంచి, చెడుల కేస్‌స్టడీలు ఇచ్చి విశ్లేషణ చేయాలి. 30నిమిషాల సమయం కేటాయించి చర్చ చేయమని చెప్పాలి. ప్రజంటేషన్‌లో వచ్చిన విషయాలు ఎందుకు ఒకచోట మంచిగా వచ్చింది? ఎందుకు ఒక చోట చెడు జరిగింది అన్న విషయం చర్చ పెట్టాలి. ఈ విషయాలను ప్రణాళికలకు లింకు చేస్తూ చర్చ జరపాలి.

- వినియోగదారుల బృందాలు ప్రణాళికలు ఎలా చేయాలి?
- వనరుల పటం ద్వారా వనరులను వాటి స్వభావాలను (స్థితిగతులు) గుర్తించాలి
- ప్రస్తుతం ఆ వనరుల నుండి ఏ అవసరాలు తీరుతున్నాయి గుర్తించాలి
- ఇంటి అవసరాలు ఉదా: తిండి, కట్టెలు, నీరు, మేత పశువుల అవసరాలు ఏమున్నాయి? పై అవసరాలను గుర్తించి వాటిలో అత్యవసరమైన అవసరాలకు ముందు ప్రాధాన్యత ఇచ్చి తీర్చుకునే విధంగా ప్రణాళికలు చేసుకోవాలి.

**వనరులను యాజమాన్యం సంరక్షణ**

ఈ విషయాన్ని అందినంత దండుకో ఆట ద్వారా సభ్యులకు తెలియచేయాలి.

**పద్ధతి : ఆట (అందినంత దండుకో)**

**ఉద్దేశం : అదుపులేని వాడకంతో వనరుల దుస్థితి గురించి తెలుసుకోవటం**

**కావలసిన మెటేరియల్: రాళ్ళు 300 (చిన్న చిన్నవి)**

**రీడింగ్ మెటీరియల్ : మార్గం చూసుకో, వనరులు కాపాడుకో అనే బ్రోచర్**

**ఆట వివరణ : ప్రకృతి వనరుల అభివృద్ధి, వినియోగం, నిర్వహణలో సంఘం పాత్రను నియాలు, కట్టుబాట్లు ఆవశ్యకతనూ, నియమాలు పాటించే విధానానికి కావలసిన ఏర్పాట్ల గురించి తెలియచేసే సందర్భంలో ఈ ఆటను ఆడించాలి.**

**ఈ ఆట ద్వారా ఇచ్చే సందేశం / నేర్చుకునే అంశాలు:**

- వ్యక్తిగత స్వార్థం వల్ల, వనరుల వినియోగం సుస్థిరంగా, అందరికీ అందుబాటులో ఉండే విధంగా జరగదు.
- సంఘంలో కట్టుబాట్లు, నియమాల వల్ల ఈ వనరుల వినియోగాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చి

సుస్థిరంగా ఉపయోగించవచ్చును.

- నియమాలను భంగపరచిన సమయంలో సంఘాలు ఏం చేయాలి? నాయకత్వ లక్షణాలు ఏమిటి? అన్న విషయంపై అవగాహన.

**ఆడవలసిన విధానం:**

- ఫెసిలిటేటర్ శిక్షణార్థులందరినీ బయటికి వెళ్ళి, గుప్పెళ్ళలో చిన్న చిన్న కంకరరాళ్ళు తెమ్మని చెప్పాలి. వారు తెచ్చిన రాళ్ళన్నీ ఫెసిలిటేటర్ తన దగ్గర పెట్టమని చెప్పాలి.
- ఫెసిలిటేటర్ ఈ ఆటని ప్రారంభించే ముందు శిక్షణార్థుల నుండి ఎవరైనా ముగ్గురిని రమ్మని పిలవాలి. తన దగ్గర వున్న రాళ్ళలో ఇంచుమించు 20 శాతం రాళ్ళని వాళ్ళ మధ్యలో నేలమీద ఉంచి, వాళ్ళని "అందినంత తీసుకోమ్మని" చెప్పాలి. వారు తీసుకోగా మిగిలిన రాళ్ళకి సమానమైన రాళ్ళని తాను మళ్ళీ ఇస్తానని ముందే ఫెసిలిటేటర్ వాళ్ళకి చెప్పాలి.
- వచ్చిన ముగ్గురు, తమకు తోచిన విధంగా అందినన్ని రాళ్ళని తీసుకొని వెళతారు. మిగిలిన రాళ్ళకి, సమానమైన రాళ్ళని ఫెసిలిటేటర్ మళ్ళీ మధ్యలో ఉంచాలి. ఈ విధంగా మొదటి పట్టు జరిగాక, ఫెసిలిటేటర్ ఆ ముగ్గుర్ని మళ్ళీ రెండో పట్టు కూడా తీసుకోమ్మని చెప్పాలి. రెండో పట్టు ఆడాక, మిగిలిన రాళ్ళకి సమానమైన రాళ్ళని తాను మళ్ళీ కలవాలి.
- ఈ విధంగా ఆ ముగ్గురు మధ్యలో ఉన్న రాళ్ళని పూర్తిగా ఖాళీ చేసేంతవరకు ఆడాలి.
- ఈ ఆట జరిగినంత సేపూ మిగతా వారిని గమనించమని చెప్పాలి. మొదటి దశలో ఆడిన ముగ్గురూ, ఎన్ని పట్టు ఆడారు, ఒక్కొక్కరు ఎన్ని తీసుకున్నారు - అన్న విషయాన్ని కో ఫెసిలిటేటర్ బోర్డు మీద రాయాలి.
- రెండో దశలో ఫెసిలిటేటర్ ఇంకో ముగ్గురిని ఆహ్వానించాలి. అదే ఆట ఆడాలి అని చెప్పాలి. అయితే ఈ సారి ఒక నిబంధన నియం ఉంచాలి. ముందు దశలో ఎన్ని పట్లు ఆడారో, ఈ దశలో కనీసం అంతకు రెట్టింపు పట్టు ఆడాలి అని చెప్పాలి. అయితే అది ఎలా సాధ్యపడుతుందో తేల్చుకొమ్మని, ఆ ముగ్గురినీ బయటకు పోయి చర్చించుకురమ్మని చెప్పాలి.
- వారు చర్చించుకుని వచ్చిన తర్వాత రెండో దశలో ఆట మొదలుపెట్టాలి. ముందు దశకన్నా ఈ దశలో శిక్షణార్థులు కొంచెం జాగ్రత్తగా ఆడటం వల్ల ఎక్కువ పట్టు ఆడగలరు. ఎప్పటిరాగానే ఫెసిలిటేటర్ మిగిలిన రాళ్ళకి సమానమైన రాళ్ళను తన దగ్గర వున్న రాళ్ళ నుండి మధ్యలో ఉంచాలి (ప్రతి పట్టు చివరలో)
- కో ఫెసిలిటేటర్ ఈ దశలో జరిగిన విధానాన్ని (ఎవరు, ఏ పట్టులో, ఎన్ని రాళ్ళు తీసుకున్నదీ) వివరంగా బోర్డు మీద రాయాలి.
- మూడవ దశకి ముందు ఆ ముగ్గురు శిక్షణార్థులలో ఒకరికి మీరు పెట్టుకున్న నియమాలని భంగపరచు అని ఫెసిలిటేటర్ రహస్యంగా సూచనలు ఇవ్వాలి. కో ఫెసిలిటేటర్ -మిగిలిన ఇద్దరికీ "పరిస్థితులు మారితే, ఏం చేస్తారో -ఆలోచించండి తగిన చర్య తీసుకోండి అని రహస్యంగా సలహా ఇవ్వాలి.
- మూడో దశలో అదే ఆట ఆడాలి ఈ ముగ్గురు శిక్షణార్థులు. అయితే ఈ దశలో ఆ ముగ్గురిలో ఒకరు నియమాలని భంగపరచడం వల్ల ముందు మొదటి దశలో ఆడిన విధంగానే రాళ్ళన్నీ త్వరగా అయిపోతాయి.

మిగతా ఇద్దరూ వారికి తోచిన విధంగా ప్రవర్తిస్తారు. (కోపగించుకోవడం, దెబ్బలాడటం, బాధపడటం, ప్రాధేయపడటం, వగైరా)

- ఈ దశలో కూడా ఎవరు ఎన్ని రాళ్ళు, ఏ పట్టులో తీసుకున్నదో కోఫెసిలిటేటర్ రాయాలి.
- చివరిగా, ఫెసిలిటేటర్ - ఏ దశలో ఆడిన వారిని, వారి ఆలోచనలను, ప్రవర్తనని విశ్లేషించేలా ప్రశ్నలు వేయాలి.
- మీరు ఏమనుకున్నారు?
- ఎందుకు, ఇన్ని రాళ్ళు తీసుకున్నారు?
    - ⋆ ఇంకొకరిని చూసి మీకు ఏమనిపించింది?
    - ⋆ దానికి కారణం ఏమిటి?
    - ⋆ ముందు దశకి, తర్వాత దశకి తేడా ఏమిటి?
    - ⋆ ఏ విషయంలో మార్పులు వచ్చాయి? ఎందుకు?
    - ⋆ బయట ఉండి ఆడని వారు ఏమనుకున్నారు?

ఈ ప్రశ్నలకి సమాధానాలుగా అందరూ వనరుల వినియోగంలో నియమాల అవసరాన్ని ఆ నియమాలు భంగపరిస్తే ఏం చేయాలి? వగైరాలను గుర్తించి వివరంగా చర్చిస్తారు. ఆ రాళ్ళనే ప్రకృతి వనరులైన నీరు, భూమి, చెట్లుగా గుర్తించి వాటి యాజమాన్యంలో కావలసిన వ్యవస్థాగత ఏర్పాట్లను, అందులో వ్యక్తుల పాత్రను, నాయకత్వ లక్షణాలను గుర్తించే విధంగా చర్చ జరపాలి.

**ఫెసిలిటేటర్‌కి సూచనలు:**

- ■ తన దగ్గర ఎక్కువ శాతం (80శాతం) రాళ్ళను మధ్యలో తక్కువ శాతం (10శాతం) రాళ్ళను ఉంచాలి.
- ■ మొదటి దశలో ఫెసిలిటేటర్ టీంలో నుండి ఒకరు ఉంటే ఆట రసాభాసా కాకుండా ఆడే అవకాశం ఉంటుంది. ఒక్కొక్కసారి మొదటి దశలోనే కొందరు సామాన్యంగా ప్రవర్తించే విధానానికి భిన్నంగా ప్రవర్తిస్తే ఈ ఫెసిలిటేటర్ టీం సభ్యులు తగిన విధంగా ప్రవర్తించి ఆటలో సందేశాన్ని అందించేదానికి సహాయపడవచ్చు.
- ■ ఆఖరిగా ఫెసిలిటేటర్ గ్రూపు సభ్యులందరికి మార్గం చూసుకో/వనరులు కాపాడుకో అనే బ్రోచర్ ఇచ్చి అందరితో చదివించి అందరికి అర్థమయిందో లేదో ఒకసారి రివ్యూ చేసి ఈ సెషన్‌ను ముగించాలి.

# సెషన్ - 5

**విషయం: వినియోగదారుల బృందాల బాధ్యతలు**

**పద్ధతి: కేస్‌స్టడీ ( చికాకుల పల్లి) విశ్లేషణ, జంబుల్‌గేమ్**

**ఉద్దేశం: వినియోగదారుల బృందాల బాధ్యతలు తెలుసుకుంటారు**

**వివరణ:**

సభ్యులను చిన్న గ్రూపులుగా విభజించి వారికి చికాకులపల్లి కేస్‌స్టడీ ఇచ్చి చదివి ఏమి అర్థం చేసుకున్నారో చర్చించి బృందాలకు ఉండవలసిన బాధ్యతలు గుర్తించమని చెప్పాలి.

**బాధ్యతలు:**

1 బ్యాంకు లావాదేవీలు

2 పర్యవేక్షణ

3 ప్రణాళిక

4 నాణ్యత

5 పారదర్శకత

6 చెల్లింపులు చూడటం

7 అకౌంట్ల నిర్వహణ

8 ప్రాధాన్యతలు గుర్తించడం

9 సమన్వయం

10 సమావేశాల నిర్వహణ

11 వాటాధనం, పొదుపు, అప్పు

భాగస్వామ్యం పెంచుట

**ఈ బాధ్యతలను మూడు రకాలుగా విభజించవచ్చు అవి:**

**1 ఆర్థికపరమైన బాధ్యతలు**

**2 కార్యక్రమ అమలు బాధ్యతలు**

**3 గ్రూపు నిర్వహణ బాధ్యతలు**

**1 ఆర్థికపరమైన బాధ్యతలు**

- ✯ బ్యాంకు లావాదేవీలు
- ✯ చెల్లింపులు చూడటం
- ✯ అకౌంట్ల నిర్వహణ
- ✯ పేదల, మహిళల ప్రాధాన్యత

**2 కార్యక్రమ అమలు బాధ్యతలు**

- ■ పర్యవేక్షణ
- ■ నాణ్యత
- ■ పారదర్శకత
- ■ సమన్వయం
- ■ వాటాధనం పొదుపు, అప్పు

**3 గ్రూపు నిర్వహణ బాధ్యతలు**

- ✪ ప్రణాళిక
- ✪ సమావేశాలు
- ✪ భాగస్వామ్యం పెంచటం

మూడు అంశాలకు సంబంధించిన బాధ్యతలను జంబుల్‌గేమ్ ద్వారా గ్రూపు సభ్యులతో చేయించాలి.

అన్ని విషయాలను కలిపి సభ్యులను చిన్న గ్రూపులుగా చేసి మూడు రకాలుగా విభజించమని చెప్పాలి.

గ్రూపు సభ్యుల నుండి వచ్చిన బాధ్యతలను సమీకరణ చేస్తూ పైన పేర్కొనబడిన 12రకాల బాధ్యతలను వివరించి వాటిని మూడు అంశాలు ఉదా: ఆర్థిక పరమైన, కార్యక్రమ అమలు నిర్వహణ బాధ్యతలుగా విభజించి వాటి కింద ఏ బాధ్యతలు వున్నాయో వాటిని ఎలా సక్రమంగా చేపట్టాలి అనే విషయాలు చెప్పి అందరికి ఆ బాధ్యతలు అర్థమైందా లేదా అని తెలుసుకొని సెషన్ ముగించాలి.

# సెషన్ - 6

**విషయం: సహజ వనరులకు సంబంధించిన కట్టుబాట్లు**

**ఉద్దేశం: సహజ వనరులకు సంబంధించిన కట్టుబాట్లు తెల్సుకుంటారు**

**పద్ధతి: రిసోర్స్‌మ్యాప్**

**సమయం: రెండు గంటలు**

**కావలసిన మెటీరియల్: నక్ష వేయటానికి కావల్సిన రంగులు, బ్రౌన్‌షీట్స్, మార్కర్లు**

**వివరణ:**

గ్రామ నక్ష గ్రూపు సభ్యులలో ఒక గ్రామాన్ని ఉదాహరణగా తీసుకొని ఆ సభ్యులచే వేయించాలి. ఆ నక్షలో ఉమ్మడి వనరులు ఉదా: గ్రామ పంచాయితీ స్కూలు, గ్రంధాలయం, గుడి, కమ్యూనిటీ హాలు, వ్యక్తిగత వనరులు, ఉదా: ఇల్లు, పొలం మొదలైన నక్షలో గుర్తించాలి.

- గుర్తించిన వనరుల యాజమాన్యం నిర్వహణకు ఎవరు బాధ్యులు ఎలా చేస్తున్నారు అన్న విషయంపై సభ్యులతో చర్చించాలి.
- సభ్యులు చెప్పిన విషయాలు అన్ని బోర్డుపై రాయాలి. వచ్చిన విషయాలను రెండుగా విభజించాలి. 1. ఉమ్మడి వనరులు 2. వ్యక్తిగత వనరులు. ఈ చర్చలలో వచ్చిన విషయాలు ఉమ్మడి వనరులకు సంబంధించిన యాజమాన్యం, నిర్వహణ ఏ విధంగా వుంది, వ్యక్తిగత వనరులకు సంబంధించిన యాజమాన్యం, నిర్వహణ ఏ విధంగా వుంది సభ్యులతో కలిసి చర్చించాలి.
- ఈ చర్చలలో సహజంగా గుడి, బడికి సంబంధించిన నిర్వహణ, యాజమాన్యం విషయంలో సక్రమంగా జరుగుతున్నట్లు ఎందుకంటే గుడి అనగా అందరు వెళ్ళి దేవుడికి మొక్కేది అని, బడి అనగా చదువుకొనే స్థలం కాబట్టి శుభ్రంగా వుండాలని ప్రత్యేకించి బాధ్యతలు తీసుకొని, కట్టుబాట్లు పెట్టుకొని నిర్వహిస్తారు. అలాగే మనం పెట్టుకున్న చెట్లు, బాగుచేసిన గుట్టలు నీరు ఆగటానికి కట్టిన కట్టడాలు వాటిని ఎలా కాపాడుకుంటారు? పెరిగిన తరువాత ఎవరు వినియోగించుకుంటారో దానికి కావలసిన కట్టుబాట్లు ఏంటి?

**కట్టుబాట్లు:**

1 పేదల వనరులకు ఎక్కువ ప్రాధాన్యత

2 విరాళాలు తప్పనిసరిగా వసూలు చేయాలి

3 పశువుల మేత వాడకంలో కట్టుబాట్లు

4 అందరు చెట్లు పెంచాలి వాటిని కాపాడాలి

5 పెరిగిన జల వనరులను సక్రమంగా వినియోగించుకోవాలి

6 కొత్త బోర్లు వేయటంలో నియమాలు పాటించాలి

7 ఆరుతడి పంటలు వేయాలి మొదలైన కట్టుబాట్లు

సహజ వనరులకు సంబంధించినవి పెట్టుకొని వాటిని సంరక్షించుకోవాలి.

# సెషన్ - 7

**విషయం: క్రోడీకరణ, ఫీడ్‌బ్యాక్, ముగింపు**

**సమయం: 45నిమిషాలు**

**పద్ధతి: ప్లీనరీ చర్చ**

**వివరణ:**

గ్రూపు సభ్యుల నుండి జరిగిన రెండురోజుల కార్యక్రమాన్ని సమీకరణ చేసి వారినుండి కార్యక్రమం ఎలా వుంది అనే దానిపై ఫీడ్‌బ్యాక్ తీసుకొని కార్యక్రమాన్ని ముగించాలి.

- - -